క్లుప్తంగా

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలు స్వీకరిస్తున్న గ్రంథాలయాధికారులు

ఎచ్చెర్ల : లావేరు శాఖా గ్రంథాలయానికి అదే గ్రామానికి చెందిన కె.గోవింద్ రూ. 5 వేలు విలువైన పుస్తకాలను గురువారం వితరణగా అందించారు. గోవింద్ ఈ గ్రంథాలయంలో చదువుకుని బ్యాంక్ మేనేజర్ పోస్టు సాధించాడు. అందుకు గుర్తుగా పుస్తకాలు అందించినట్లు గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు తెలిపారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

రణస్థలం : పొందూరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఈ నెల 7న విద్యుత్ వినియోగదారుల సమస్యలపై పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ కార్యదర్శి మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జి.సిగడాం, పొందూరు, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, పైడిభీమవరం ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు హాజరై ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు బి.సులేఖరాణి, అకౌంటెంట్ సభ్యులు షేక్‌బాబర్ హాజరవుతారని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రణస్థలం: రణస్థలం గ్రామానికి చెందిన మహదాసు మోహనరావు కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో లాస ఫౌండేషన్ వ్యవస్థాపకులు డి.వి.ఎస్ భరద్వాజ్ ఆదేశాల మేరకు సభ్యులు రూ.12వేలు ఆర్థిక సహాయం గురువారం అందజేశారు. ఆరోగ్యం కుదుట పడే వరకు నెలకు రూ.3500 అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు పీఎంఏవై వర్తింపజేయాలి



కేంద్ర మంత్రిని కలిసిన ఏపీ రాష్ట్ర పెన్షనర్ల ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్ : విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు ప్రధానమంత్రి ఆరోగ్య యోజన వర్తింపజేయాలని ఆంధ్ర పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాయన్, రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ చౌదరి పురుషోత్తమనాయుడు ఆధ్వర్యంలో గురువారం విశాఖపట్నంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌ని కలిసి సమస్య వివరించారు. కార్యక్రమంలో పెన్షనర్ల జేఏసీ నేతలు తూము నాగభూషణం, జి.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం హయాతీనగరంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే ఏపీ బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మిని గురువారం ఘనంగా సత్కరించారు. 38 ఏళ్ల సర్వీస్‌లో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఉన్నతస్థాయికి చేరుకోవడం పట్ల ఉపాధ్యాయులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తుండటాన్ని వారంతా గుర్తుచేశారు.

భద్రమహంకాళి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజల్లో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఇలిసిపురం గ్రామదేవత భద్ర మహంకాళి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

పైడిభీమవరం పాఠశాలలో మధ్యాహ్న భోజనంతో విద్యార్థులు



అధ్వాన్నం!

- గాడితప్పిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నిర్వహణ
- నాసిరకం బియ్యం కావడంతో ముద్దవుతున్న అన్నం
- గత్యంతరం లేక పారబోస్తున్న విద్యార్థులు
- సాక్షాత్తు అధికారుల తనిఖీల్లోనే బహిర్గతం



మెట్టవలస పాఠశాలలో తినకుండా పడేసిన అన్నం(ఫైల్)

రణస్థలం: కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు డొక్కలు మాడుతున్నాయి. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా నాసిరకమైన భోజనం వడ్డిస్తుండటంతో తినేందుకు విద్యార్థులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. చాలామంది భోజనం తినలేక పారబోస్తున్నారు. నెల రోజులుగా లావేరు, మెట్టవలస, పైడిభీమవరం తదితర పాఠశాలల్లో మధ్యాహ్నం పూట నాసిరకంగా ఉన్న అన్నం పారబోయడం పరిపాటిగా మారింది.



ఇటీవల లావేరు హైస్కూల్లో విద్యార్థులు పడేసిన ముద్ద అన్నం

తహసీల్దార్ తనిఖీల్లో బహిర్గతం..

ఈ నెల 4న లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి నాసిరకం బియ్యం సరఫరా చేయడంతో అన్నం ముద్దగా మారింది. కనీసం తినడానికి కూడా వీల్లేని విధంగా మారడంతో బయట పారబోశారు. విషయం తెలుసుకున్న లావేరు తహసీల్దార్ జోగారావు, డీటీ శ్రీనివాసరావు, వీఆర్వో వేణుగోపాలరావు పాఠశాలకు వెళ్లి అన్నం పరిశీలించారు. బియ్యం మళ్లీ వండించగా మరోసారి ముద్దగా మారడంతో పౌరసరఫరాల గోదాం ఇన్‌చార్జికి ఫోన్ చేశారు. లావేరు హైస్కూల్‌కు వచ్చిన బియ్యం 44 బస్తాలను వెంటనే మార్చి పంపించాలని ఆదేశించారు. ఫిబ్రవరి 18న మెట్టవలస హైస్కూల్లోనూ నాసిరకం భోజనం కారణంగా విద్యార్థులకు పస్తులు తప్పలేదు.

బియ్యం మార్చమని చెప్పాం

లావేరు హైస్కూల్‌కు వచ్చిన బియ్యం నాసిరకంగా ఉన్నాయని ఉపాధ్యాయులు, వంట సిబ్బంది చెబుతున్నారు. మేం వెంటనే పరిశీలించి 44 బస్తాలు మార్చమని చెప్పాం.
– వై.జోగారావు, తహసీల్దార్, లావేరు

నాణ్యమైన బియ్యమెక్కడ?

పాఠశాలలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి. నాసిరకం బియ్యం, ఇతర కూరలు వండటం వల్ల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. గత ప్రభుత్వంలో ఎంతో చక్కగా నడిచే పాఠశాలలు, నేడు అధ్వానంగా తయారయ్యాయి.
– ముద్దాడ రాజశేఖర్, ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు

తినలేకపోతున్నాం..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో రణస్థలం మండలంలో 108 పాఠశాలల్లో 7650 మంది, జి.సిగడాం మండలంలో 63 పాఠశాలల్లో 4900 మంది, లావేరు మండలంలో 85 పాఠశాలల్లో 5216 మంది, ఎచ్చెర్ల మండలంలో 106 పాఠశాలల్లో 8041 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో సగానికిపైగా విద్యార్థులు భోజనం నాసిరకంగా ఉంటుందంటూ మధ్యాహ్న భోజనం మానేస్తున్నారు. మెనూ సక్రమంగా అమలు కాకపోవడంతో పాటు సాంబారులో గంజి కలపడం, అన్నం ముద్దగా మారడం, కూరలు రుచిగా వండకపోవడం వంటి కారణాలు చూపుతున్నారు.

మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు

శ్రీకాకుళం అర్బన్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండి ఉన్నతంగా ఎదిగి స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం ఆకాంక్షించారు. నగరంలోని ఎన్జీవో కార్యాలయంలో ఏపీ జేఏసీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆటలు, పాటల పోటీలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ అనుమతి మేరకు గురు, శుక్రవారాల్లో మహిళా ఉద్యోగులకు మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఆటలు ఉపయోగపడతాయని చెప్పారు. విజేతలకు 8న బహుమతులు అందజేస్తామని తెలిపారు. టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, మెమొరీ టెస్ట్, డ్యాన్స్, పాటల పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ చౌదరి పురుషోత్తం నాయుడు, ఏపీ జేఏసీ కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు హైమావతి, కన్వీనర్ శ్రావణి, మమత బెహరా, లలిత, యశోద, పార్వతి, రోజా తదితరులు పాల్గొన్నారు.



మ్యూజికల్ చైర్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

క్లస్టర్ల వారీగా వేడుకలు

గార : మండలంలో క్లస్టర్ల వారీగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించాలని ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు తెలిపారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, మహిళలకు పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో రఘు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందిస్తున్న సూర శ్రీనివాసరావు



సామగ్రి అందుకున్న బాలికలతో స్వరాజ్యలక్ష్మి, స్వర్ణకుమారి, దామోదర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సామాజిక, వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు గురువారం శ్రీకాకుళం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కోటబొమ్మాళిలోని ఆరు పాఠశాలల్లో చదువుతున్న సుమారు వెయ్యి మంది విద్యార్థులకు అట్టలు, పెన్నులు తదితర పరీక్ష సామగ్రిని గురువారం అందజేశారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు గురువారం అట్టలు, పెన్నులు, జామెట్రీ బాక్సు తదితర పరీక్షల సామగ్రిని ఉచితంగా అందజేశారు. ప్రిన్సిపాల్ గొలివి స్వరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేదిక ఉపాధ్యక్షులు డాక్టర్ సూర స్వర్ణకుమారి, రాష్ట్ర కన్వీనర్ గురుగుబెల్లి దామోదరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారుల నుంచి వృద్ధులు వరకు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శాంతిశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం ఆర్‌టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో ఐ.సి.డి.ఎస్.అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండు శంకర్ సతీమణి స్వాతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రకాల వంటకాలు, ఆకుకూరలను ప్రదర్శించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమర సింహుడు, కె.రవి శంకర్ శర్మ, నోడల్ అధికారి పి.మణి, అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ జి.శోభారాణి, ఎచ్చెర్ల సీడీపీఓ పాపినాయుడు, ఐసీడీఎస్ పర్యవేక్షకులు సీతామహాలక్ష్మి, ఉమ, యశోద, యోగేశ్వరి, కల్యాణి, లీల, వెంకటరత్నం, ప్రొటెక్షన్ అధికారులు మల్లేశ్వరరావు, సీతారాం, రామారావు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం తీసుకుంటున్న అధికారులు, సిబ్బంది

గ్రంథాలయ సెస్ వసూలు చేయాలి

ఎచ్చెర్ల : శాఖా గ్రంథాలయాల సిబ్బంది లైబ్రరీ సెస్ వసూలుకు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు అన్నారు. గురువారం లావేరు, మురపాక శాఖా గ్రంథాలయాలలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రేడ్–1 గ్రంథాలయ అధికారి శంకరరావు, లైబ్రేరియన్లు మురపాక శ్రీనివాసరావు, తలే రాంబాబు, సహాయకులు టి.వీరభద్రుడు, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు

అనాథలకు అన్నదానం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఆర్‌అండ్‌బీ వసతి గృహం వద్ద రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతా కళ్యాణ్ అనురాగ నిలయంలో అనాథ చిన్నారులు, సి.వి.నాగజ్యోతి ఆనంద నిలయంలో వృద్ధులకు గురువారం అన్నదానం నిర్వహించారు. సంతకవిటి మండలం వాల్తేరు గ్రామానికి చెందిన గురుగుబెల్లి స్వామి నాయుడు తన కుమారుడు ప్రేమ్‌వర్ధన్‌నాయుడు జన్మదిన వేడుకలు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 40 మంది ఎంపిక



మాట్లాడుతున్న దివీస్ సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని ఆర్ట్స్‌కాలేజ్ రోడ్‌లో ఉన్న కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో ప్రతిభ కనబర్చారు. కళాశాలలో గురువారం దివీస్ ల్యాబొరేటరీస్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 63 మంది పాల్గొనగా 40 మంది ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ తెలిపారు. వీరికి రూ.2.6 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో దివీస్ మేనేజర్ పూర్ణచంద్రరావు, సాంబశివ, విద్యా సంస్థల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, సుబ్రహ్మణ్యం, ఆర్.రాజు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట



శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం ఒకటో పట్టణ పరిధిలోని నిర్మానుష్య ప్రదేశాలు, నదీ పరివాహక ప్రాంతాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు డ్రోన్ నిఘా కెమెరా తిరుగుతోందని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. గంజాయి, మద్యం బహిరంగంగా సేవించడం, పేకాట, ఈవిటీజింగ్ వంటివి పూర్తిగా అరికట్టేందుకు కృషిచేస్తున్నామని చెప్పారు. ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం



సమావేశంలో పాల్గొన్న కార్యవర్గ సభ్యులు

జి.సిగడాం : పంచాయతీ కార్యదర్శులపై పనిభారం, వేధింపులు తగవని గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు తులసీప్రసాద్ సాహు, ఏర్నేని జ్యోతి శ్రీనివాస్ అన్నారు. గురువారం జి.సిగడాంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో వివిధ శాఖల సిబ్బంది ఉన్నారని, వారి పని కూడా పంచాయతీ కార్యదర్శులకే అప్పగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సభ్యులు జాడ వెంకటన్నాయుడు, పొట్నూరు సురేష్‌కుమార్, వడగా గౌరీశంకరరావు, ఎదూరి హరిబాబు, రాజశేఖరం, కిమిడి హైమావతి, సుందరమ్మ, హిమబిందు, రాజా రమేష్, గౌరీశ్వరి, ఉషారాణి, భారతి, సురేష్‌కుమార్, సతీష్, హైదేహి సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన స్వరూప్



వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన విభాగాన్ని మరింత పటిష్టం చేయాలని, నియోజకవర్గ, మండల స్థాయిలో సమావేశాలు పెట్టాలని సూచించినట్లు తెలిపారు. తనమీదున్న నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తానని స్వరూప్ పేర్కొన్నారు.
- శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

విజయగణపతికి సహస్ర కలాలతో అర్చన



నగరంలోని విజయగణపతి ఆలయంలో పదో తరగతి విద్యార్థుల కోసం విజయగణపతికి సహస్ర కలాలతో గురువారం అర్చనలు చేశారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారి వద్ద పెన్నులు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న టెన్త్ విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేస్తామని ఆలయ ధర్మకర్త వీనస్ హరి తెలిపారు.
- శ్రీకాకుళం కల్చరల్

బాలుడికి చక్రాల కుర్చీ వితరణ



కలెక్టర్ బంగ్లా సమీపంలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న లోపింటి అప్పలరాజు, లావణ్యల కుమారుడు రితీష్ పోలియో బాధితుడు కావడంతో అదే వీధికి చెందిన ధవళ జనార్దన, బొడ్డేపల్లి చాణక్య చక్రాల కుర్చీ సమకూర్చారు. దీనిని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు నంది ఉమాశంకర్, చిన్మయరావు, మేనేజర్ జి.రమణ, బి.జగదీష్ పాల్గొన్నారు.
- శ్రీకాకుళం కల్చరల్

పోలీసు విధులపై అవగాహన



మహిళా సాధికారిత వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ మున్సిపల్ స్కూల్ విద్యార్థినులు 30 మందికి ఆయుధాల పనితీరు, రిసెప్షన్, లాకప్, కమ్యూనికేషన్ వైర్‌లెస్ సెట్ల వినియోగం తదితర అంశాలపై ఏఎస్ఐ కృష్ణంనాయుడు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైటర్ సత్యనారాయణ, మహిళా కానిస్టేబుల్ మీనా, ఐడబ్ల్యూ రమేష్ పాల్గొన్నారు.
- శ్రీకాకుళం క్రైమ్

శ్రీకాకుళం అభివృద్ధికి సహకరించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని, ప్రధానంగా న్యాయవాదుల సూచనలు,సలహాలు ఎంతో అవసరమని శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) చైర్మన్ కొరికాన రవికుమార్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని సుడా కార్యాలయంలో గురువారం జిల్లా కోర్టు న్యాయవాదులు సుడా చైర్మన్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని పర్యాటక కేంద్రంగా చేసేందుకు తగిన వనరులున్నాయని, వాటిని సరైన పద్ధతిలో ఉపయోగించుకోవాల్సి ఉందన్నారు. సిక్కోలు రూపురేఖలు మార్చేందుకు ఏప్రిల్‌లో మేధావులతో సదస్సు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వాన కృష్ణచంద్, వావిలపల్లి జగన్నాథనాయుడు, కొమ్ము రమణమూర్తి, కె.అఫీస్‌నాయుడు, మామిడి క్రాంతి, గొర్లె లక్ష్మణరావు, డోల బాలమురళీకృష్ణ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సుడా చైర్మన్ రవికుమార్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

పేదలను మోసగించడమే చంద్రబాబు నైజం

జి.సిగడాం: ఎన్నికల హామీలను అమలు చేయకుండా పేదలను మోసం చేయడమే సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. గురువారం విజయరాంపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు చేసిన మోసాలను శాసనసభలో నిలదీస్తారనే భయంతోనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి వైఎస్సార్ సీపీ ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదన్నారు. అధికారంలోకి వచ్చాక ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయలేదన్నారు. ఇతర హామీలను కూడా అమలు చేయకుండా ప్రజలకు మోసగిస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహన్, దవళపేట సర్పంచ్ వడిశ మహేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పేడాడ శ్రీరామమూర్తి

యల్లమ్మ సిరుల జాతర ప్రారంభం

గార: మండలంలోని వమరవల్లిలో యల్లమ్మ తల్లి సిరుల జాతర ప్రారంభమైంది. గురువారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో ఉత్తరాంధ్ర నుంచి వచ్చిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని యల్లమ్మ తల్లి (పుట్ట) పూజలు చేశారు. భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ గంట రఘునాథరెడ్డి తెలిపారు. ఎస్సై ఆర్.జనార్దనరావు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.